వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో కలెక్టర్, జేసీ తదితరులు



రేపు కలమల్లలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

కడప (కలెక్టరేట్), ఆగస్టు 27: జిల్లాలో తొలి తెలుగు శాసనాలు లభ్యమైన ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో గురువారం నిర్వహించనున్న తెలుగుభాషా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కలెక్టర్ శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డిలతో కలసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలమల్ల గ్రామంలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల ప్రాంగణంలో తొలి తెలుగుశాసనాలు లభ్యమయ్యాయన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని నలుదిశలా వ్యాపింపచేసే ఉద్దేశ్యంతో అదే గ్రామంలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోందన్నారు. 29న గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమలో జిల్లాలో తెలుగు భాషకు సేవ చేసిన మనముందు లేనివారిని స్మరించుకుంటూ, మనమధ్యలో ఉన్నవారిని సత్కరించనున్నామన్నారు. తెలుగు భాష ఔన్నత్యంపై విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అనురాధ, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శివకుమార్, రామ్‌కుమార్, ఇంటాక్ సభ్యులు చిన్నప్పరెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు కలమల్లకు వెంకయ్యనాయుడు రాక

ఎర్రగుంట్ల, ఆగస్టు 27: భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం ఎర్రగుంట్ల మండలం కలమల్లకు రానున్నారు. తెలుగు భాషా దినోత్సవం కలమల్లలో ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. 29వ తేదీ ఉదయం హైదరాబాదు నుంచి విమానంలో బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రైలులో బయలుదేరి 11.35గంటలకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చేరుకుంటారు. రేడ్డు మార్గాన 12.15గంటలకు కలమల్ల సభప్రాంగణానికి చేరుకుంటారు. కార్యక్రమం అనంతరం తిరిగి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ నుంచి నిజాముద్దీన్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి తిరుపతి వెళతారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా: కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీలో భాగంగా చట్టబద్ధంగా, పారదర్శకంగా ఇసుక సరఫరా జరిగేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జేసీ అదితిసింగ్‌తో కలసి ఇసుక రవాణా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్టాక్ పాయింట్ నుంచి టన్ను ఇసుక వినియోగదారుని ఇంటికి చేర్చేందుకు కిలోమీటరుకు రూ.9గా రవాణా చార్జీలు నిర్ణయించామన్నారు. ఇసుక రవాణా, నిర్వహణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తున్నామని తెలిపారు.. జిల్లా యంత్రాంగం నిర్ణయించిన రవాణా చార్జీలను అతిక్రమిస్తే, అదనపు చార్జీ వసూలు చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 08562-246344కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో శాండ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ విమలమ్మ, డీటీసీ మీరాప్రసాద్, శాండ్ స్టాక్ స్పెషల్ ఆఫీసర్ సురేశ్ కుమార్, ఆనంద్ నాయక్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నరకం అనుభవిస్తున్నా..



- భర్త చనిపోయినా ఇంటికి పంపలేదు
- నారా లోకేశ్ అన్నా.. కాపాడండి..
- కువైత్ నుంచి వీడియో కాల్‌లో మహిళ ఆవేదన

నిమ్మనపల్లి, ఆగస్టు 27: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఏడాది క్రితం కువైత్‌కు వచ్చానని, అయితే ఇక్కడికి వచ్చినప్పటి నుంచి తన ఇంటి యజమానులు తనకు నరకం చూపిస్తున్నారని అయినా వాటిని భరిస్తూ వచ్చానని.. అయితే నాలుగు రోజుల క్రితం తన భర్త చనిపోయాడని తెలిపినా తనను ఇండియాకు పంపకుండా ఇంకా ఎక్కువగా వేధిస్తున్నారని, నారా లోకేశ్ అన్నా.. తనను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని ఓ మహిళ పంపిన వీడియో సోషల్ మీడియాలో ఇప్పుడు వైరల్ అయింది. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ సింగంవారిపల్లికి చెందిన రెడ్డిబాషా భార్య మయిమూన్ ఏడాది క్రితం కువైత్‌కు వెళ్లింది. వెళ్లినప్పటి నుంచి ఇంటి యజమానులు తనకు నరకం చూపిస్తున్నా అప్పులు తీర్చాలన్న ఉద్దేశంతో వాటిని భరిస్తూ ఇక్కడే ఉన్నానని తెలిపింది. కాగా నాలుగు రోజుల క్రితం తన భర్త అనారోగ్యంతో మరణించినట్లు కుమారుడు తెలిపాడని, దీంతో తాను ఇంటికి వెళతానని చెప్పినా తన యజమానురాలు పంపించడం లేదన్నారు. తనను నారా లోకేశ్ అన్న కాపాడి ఇండియాకు రప్పించాలని వేడుకుంది.

రిజిస్ట్రేషన్లలో ఏ-1 దొంగలు





ఒకే వ్యక్తి తొమ్మిదిసార్లు అమ్మిన ఇల్లు ఇదే

- ఒకే ఆస్తిని.. ఒకే వ్యక్తి 9 సార్లు అమ్మకాలు
- 2022-23 మధ్యలో 5 సార్లు రిజిస్ట్రేషన్లు
- సహకరించిన సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది
- లబోదిబోమంటున్న బాధితులు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 27: రిజిస్ట్రేషన్ శాఖల్లో అడ్డగోలు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందంగా సబ్ రిజిస్ట్రార్ల దందా సాగుతోంది. వీరికి దళారులు, కబ్జాదారులు తోడవ్వడంతో లక్షలిచ్చిన వారికే అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేస్తూ ఆ శాఖపై ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తున్నారు. ఇల్లు, ఇంటి స్థలం, భూమి రిజిస్టర్ చేయాలంటే సర్వే నెంబరు, హక్కుదారుడు మొదలు ఈసీ, ఆర్‌ఎస్‌ఆర్, ఆర్‌హెచ్, 1-బి, అడంగల్, ఇంటి పన్ను, లింకు డాక్యుమెంట్స్ అన్నీ పరిశీలిస్తారు. ఇందులో ఏ ఒక్కటి తక్కువైనా సరే కొర్రీలు వేసి రిజిస్ట్రేషన్లు ఆపేస్తారు. కానీ ఈ కార్యాలయంలో ఒకే ఆస్తికి 9 సార్లు రిజిస్ట్రేషన్లు జరగడం విశేషం. గత పదేళ్లుగా ఒకే ఆస్తిని, ఒకే వ్యక్తి, ఒకే డాక్యుమెంట్ నెంబర్‌పై తప్పుడు పత్రాలను సృష్టిస్తూ 9 సార్లు ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నాడు. 2022-23 మధ్య కాలంలో ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ హయాంలో ఏకంగా 5 సార్లు రిజిస్ట్రేషన్లు చేశారంటే.. రిజిస్ట్రేషన్ శాఖలోని డొల్లతనం, సబ్ రిజిస్ట్రార్ల అవినీతి స్పష్టంగా తెలుస్తోంది. ఈ సంఘటన కడప అర్బన్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..

2002లో కార్పొరేషన్ పరిధిలోని ఏ-1 నగర్‌లో సర్వే నెంబర్లు414/2, 418/1-2, 533కు సంబంధించి 2.48 ఎంకరాల భూమి ఉంది. ఆ భూమి యజమాని చాటికొండ సుబ్రమణ్యం 2002లో వెంచర్ వేసి ప్లాట్లు అమ్మాడు. అందులో ప్లాట్ నెంబరు 30లోని 4 సెంట్లను జీఎం నీలోఫర్ బేగం కొనుగోలు చేశారు. 2003లో ఆంధ్ర హౌసింగ్ కో-ఆపరేటివ్ బ్యాంకులో మార్టిగేజ్ పెట్టి రుణం తీసుకుని ఇల్లు కట్టారు. 2006 అనారోగ్యంతో ఆమె మృతిచెందారు. ఆమెకు నలుగురు సంతానం. వారసుల్లో ఒకరైన జీఎం అమీనుద్దీన్ తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ సృష్టించి 2015లో ఇంతియాజ్‌బాషాకు రూ.40 లక్షలకు ఇంటిని అమ్మాడు. కొంతకాలం అదే ఇంటిలో బాడుగకు ఉన్నాడు. ఇతను బాడుగ చెల్లించకుండా ఎదురు తిరగడంతో ఇంతియాజ్‌బాషా కలెక్టర్లు, ఎస్పీలు, మంత్రులు, తహశీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కాగా.. భాగ పరిష్కారం పేరుతో ఇంతియాజ్‌బాషాకు సంబంధం లేకుండా అదే ఇంటిని ఒంటేరు రామాంజనేయులుకు అమీనుద్దీన్ అమ్మాడు. అయితే దొంగపత్రాలతో అమ్మినట్లు గుర్తించిన రామాంజనేయులు వెంటనే కోర్టుకెళ్లడం, జీఎం అమీనుద్దీన్‌పై నేరం రుజువు కావడంతో రెండేళ్లు శిక్ష పడింది.. కోర్టులో కేసు సాగుతుండగానే 2016లోనే అదే ఇంటిని డాక్యుమెంట్ నెంబరు 1057/2016గా విక్రయించాడు. నాటి నుంచి ఒకరికి తెలీకుండా మరొకరికి 1057/2016 డాక్యుమెంట్ లింక్‌తో మహ్మద్ జావీద్‌కు 2020లో, అదే సంవత్సరం షేక్ జిలానీ బాషాకు, ఇబ్రహీంకు, 2021లో లకిడి ఉమాలక్ష్మీదేవికి, 2022లో పఠాన్ నబీదాఖానంకు ఇంటిని అమ్మాడు. అంతటి ఆగకుండా తప్పుడు పత్రాలతో మళ్లీ భాగపరిష్కారాల పేరుతో ఇంతియాజ్‌కు అమ్మిన ఇంటిలో 2సెంట్ల స్థలం అన్నదమ్ములు రిజిస్టర్ చేసుకుని అదే సంవత్సరం గుండ్రాతి వెంకటేశ్‌కు విక్రయించారు. 2023లో షేక్ యాస్మిన్‌కు అమ్మారు. తమకు కోటి రూపాయలకు పైగా టోకరా వేసినట్టు బాధితులు కన్నీరుమున్నీరు పెడుతున్నారు. 2015లో మొదటిసారి ఇంతియాజ్‌కు అమ్మిన ఇంటినే.. ఈ రెండేళ్ల కాలంలో ఆయనకు తెలీకుండా ఐదుసార్లు అమ్మకాలు జరిపారు. అయితే ఈ వివరాలు బయటకు రాకుండా ఏకంగా రిజిస్ట్రేషన్ శాఖలో టిక్కులు లేకుండా పెద్ద టెక్నిక్ చేసినట్లు తెలుస్తోంది.

ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లును బాధితులు గట్టిగా నిలదీయగా జీఎం అమీనుద్దీన్ డిఫాల్టర్, ఫేక్ పత్రాలతో రిజిస్ట్రేషన్ శాఖను మోసం చేశాడని తెలిపారు. ఈ మేరకు ఈ ఏడాది మార్చి నెలలో రిమ్స్ పోలీసు స్టేషన్‌లో క్రైం నెంబరు 107గా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ, భద్రత, భరోసా కల్పించాల్సిన సబ్ రిజిస్ట్రార్లు అడ్డగోలు గడ్డికి ఆశపడి ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ పోతే పేదల బతుకులు బుగ్గిపాలే.

కలెక్టర్, ఎస్పీలే న్యాయం చేయాలి..



2015 లో ఏ-1 నగర్ ప్లాట్ నెంబరు 30లో ఇంటిని అమీనుద్దీన్ నుంచి కొన్నాను. ఆ ఇంటిని వారికే బాడుగకు ఇస్తే ఇప్పటి వరకు ఖాళీ చేయక బెదిరిస్తున్నారు. 2016 నుంచి నాకు అమ్మిన ఇంటిని అమీనుద్దీన్ మరో 8 మందికి అమ్మి, నన్ను మానసికంగా కృంగిపోయేలా చేశారు. నాకు జరిగిన అన్యాయంపై కోర్టును ఆశ్రయించితే ఇల్లు స్వాధీనానికి తీర్పు వచ్చింది. కానీ అతన్ని ఎదిరించలేకున్నాను. అతని వల్ల నాకు హాని ఉంది. ఎస్పీ, కలెక్టర్ నాకు న్యాయం చేయాలి. తప్పుడు రిజిస్ట్రేషన్లకు సహకరించిన సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి.

- ఇంతియాజ్ బాషా, బాధితుడు

ఎస్పీని కలిసిన బాధితులు

ఒకే ఇంటిని అమీనుద్దీన్ అనే వ్యక్తి 9 మందికి విక్రయించి తమకు అన్యాయం చేశారంటూ మంగళవారం మొదటి కొనుగోలు దారుడైన ఇంతియాజ్ బాషా, మరికొందరు ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన ఎస్పీ వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు.

చెత్త.. ఆందోళన..!

- మేయర్ ఇంట్లో చెత్తవేసిన టీడీపీ శ్రేణులు
- చిన్నచౌక్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన మేయర్



మేయర్ ఇంటిలోపలికి చెత్తను విసురుతున్న టీడీపీ శ్రేణులు



మేయర్ ఇంటిలో పడిన చెత్త

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 27: కడపలో మూడు రోజులుగా చెత్త సేకరణపై టీడీపీ వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. కడప నగరంలో చెత్త సేకరణ ఆటోలను కావాలనే మేయర్ ఆపేస్తున్నారని.. ఇలా అయితే తమ ఇళ్లలో చెత్తను తీసుకెళ్లి మేయర్, కార్పొరేటర్ల ఇళ్లల్లో వేయాలని ఎమ్మెల్యే ఆర్.మాధవి పత్రికాముఖంగా పిలుపునిచ్చారు. దీనిపై మేయర్ స్పందిస్తూ.. చెత్తపన్ను వసూలు చేయవద్దంటూ మౌఖికంగా చెప్పారే కానీ ప్రభుత్వం జీవో ఇవ్వలేదన్నారు. పన్నులు వసూలు చేయకపోతే పారిశుధ్యం నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మున్సిపల్ శాఖ మంత్రి ఉండే నెల్లూరులో కంటే కడపలోనే చెత్తసేకరణ వాహనాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం టీడీపీ, టీఎన్‌ఎస్‌ఎఫ్ శ్రేణులు చిన్నచౌక్‌లోని మేయర్ సురేశ్‌బాబు ఇంటిని ముట్టడించాయి. ఆయన ఇంటి ముందు బైఠాయించి మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెత్తను మేయర్ ఇంటి ఆవరణలో వేశారు. ఇదే సమయంలో వైసీపీ శ్రేణులు మేయర్ ఇంటివద్దకు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటికే చిన్నచౌకు ఎస్‌ఐలు రాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్ పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో టీడీపీ కార్యకర్తలను పంపించేశారు.

తన ఇంటి ఎదుట చెత్త వేసిన టీడీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మేయర్ సురేశ్‌బాబు, కార్పొరేటర్లు, వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది ఎమ్మెల్యేలను చూశామని, అందరం పార్టీలు కులాలకు మతాలకతీతంగా ఉండేవారమన్నారు. టీడీపీ కార్యకర్తలతో తన ఇంట్లో చెత్త వేయించడం హీనమైన చర్య అన్నారు. మేం అనుకుంటే ఎమ్మెల్యే ఇంట్లో చెత్త వేయలేమా అన్నారు. బుద్ధుండే ఏ మనిషి కూడా ఇటువంటి పనులు చేయడన్నారు. ఇరువర్గాలను విచారించి దోషులపై చర్యలు తీసుకుంటామని కడప ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరాముడు చెప్పడంతో మేయర్ ఆందోళన విరమించారు. కాగా.. మేయర్ ఇతర వైసీపీ కార్పొరేటర్లంతా కలిసి ఎమ్మెల్యే ఇంటిముందు ఆందోళన చేసేందుకు వెళుతుండగా పోలీసులు వారిని ఎన్టీఆర్ విగ్రహం వద్దే అడ్డుకుని వెనక్కు పంపేశారు. కాగా ఈ ఘటనకు సంబంధించి మేయర్ ఇంటి ముందు ఆందోళన చేసినందుకు తిరుమలేశుతో పాటు మరో 14మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అలాగే స్టేషన్‌ఎదుట ధర్నా చేసినందుకు మేయర్‌తో పాటు మరో 14మందిపై కేసు నమోదు చేశారు.



చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన మేయర్‌కు నచ్చచెబుతున్న పోలీసులు

రెండోరోజు సీఐడీ విచారణ

- సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో నివేదికలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 27: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో సీఐడీ అధికారులు రెండోరోజు మంగళవారం కూడా విచారణ కొనసాగించారు. సోమవారం రాత్రి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో సీఐడీ అధికారులు సబ్ కలెక్టరేట్‌లో విచారణ చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజతో పాటు ఆర్డీవో హరిప్రసాద్‌ను విడివిడిగా అధికారులు విచారించినట్లు తెలిసింది. దీంతో పాటు ఫైర్ అధికారులను కూడా విచారించారు. ఫైళ్ల దహనం ఘటనలో తొలుత ఎక్కడ నుంచి మంటలు వ్యాపించాయి, ఎంత దూరం వరకు వెళ్లాయి, ఎంతసేపట్లో మంటలను అదుపు చేశారు తదితర వివరాలను సేకరించారు. అనంతరం రాత్రి 12.30 గంటల వరకు వీడియో కవరేజి మధ్య అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సీఐడీ ఉన్నతాధికారులు అక్కడే తిష్ట వేశారు. ఈ తతంగం అంతా జరుగుతున్న సమయంలో ఎవ్వరినీ లోపలికి అనుమతించకుండా సబ్‌కలెక్టరేట్ మెయిన్‌గేట్లు మూసివేసి పోలీసు బందోబస్తు నిర్వహించారు. మంగళవారం ఉదయం యథావిధిగా సబ్ కలెక్టరేట్ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐడీ ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు రాత్రి సేకరించిన వివరాలను కంప్యూటర్‌లో నివేదికల రూపంలోకి మార్చారు. దీంతో పాటు సబ్ కలెక్టరేట్ ఉద్యోగులను కూడా విచారించారు.

అక్రమార్కుల గుండెల్లో అలజడి

మదనపల్లె ఫైళ్ల దహనం కేసు విచారణను సీఐడీ అధికారులు వేగవంతం చేస్తుండటంతో ఫ్రీహోల్డ్ భూముల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డ రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, వైసీపీ నాయకుల గుండెల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే 8 మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు కాగా, వారిలో ఒక్కరిని కూడా సీఐడీ అధికారులు అరెస్టు చేయలేదు. దీంతో ఏడుగురు మదనపల్లెలో కాకుండా బయట ప్రాంతాలకు వెళ్లిపోయారు. నెల రోజులు అజ్ఞాతవాసంలో ఉన్న వీరందరూ ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. కాగా ఇప్పటికే మదనపల్లె మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్‌వోలను సీఐడీ అధికారులు విచారించినట్లు తెలిసింది. ఇకపోతే ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌లను, డీటీలను, ఆర్‌ఐలను విచారిస్తారా అనేది తెలియాల్సి ఉంది.

గంజాయిపై ఉక్కుపాదం



- జిల్లాలో చాపకింద నీరులా పాకుతున్న గంజాయి మత్తు
- కాలేజీ విద్యార్థులు, యువతే టార్గెట్‌గా సరఫరా
- ప్రైవేటు ట్రావెల్స్‌లో అక్రమ రవాణా
- కొనసాగుతున్న గాంజా ఆపరేషన్
- పోలీసుల అదుపులో పదిమంది యువకులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 27: ఇంతకాలం హైదరాబాదు, బెంగళూరు, ముంబై, ఢిల్లీ లాంటి నగరాలకే పరిమితమైన గంజాయి మత్తు నేడు జిల్లా కేంద్రాలకు పట్టణాలకు పాకుతోంది. గతంలో వృద్ధులు, సాధువులు, సన్యాసులు, జీవితంలో అన్ని కోల్పోయిన వాళ్లు మాత్రమే గుట్టుచప్పుడుకాకుండా ఎక్కడో నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి సేవించేవారు. కానీ నేడు కాలేజీకి వెళ్లే ఇంటర్, డిగ్రీ, బిటెక్ చదువుతున్న యువత గంజాయికి బానిస అవుతుండటం అందరినీ కలవర పెడుతోంది. కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని పోలీసులందరూ సమన్వయంతో దాడులు చేస్తుండటంతో గంజాయి ముఠాలు పెద్దఎత్తున పట్టుబడుతున్నాయి. ఇంతకాలం చాపకింద నీరులా పాకిన గంజాయిని కూకటివేళ్లతో పెకలించేందుకు పోలీసులు 'ఆపరేషన్ గాంజా' మొదలు పెట్టారు.



ప్రొద్దుటూరులో గంజాయి విక్రయదారుల అరెస్టు చూపుతున్న పోలీసులు (ఫైల్‌ఫొటో)

విశాఖ నుంచి దిగుమతి

ఉమ్మడి కడప జిల్లాకు విశాఖ నుంచి గంజాయి దిగుమతి అవుతోంది. ఈ విషయం గంజాయి విక్రయదారుల అరెస్టు సందర్భంగా పోలీసుల విచారణలో వెల్లడయింది. విశాఖపట్నం నుంచి నిత్యం ప్రైవేటు బస్సుల ద్వారా కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదకూరు రాయచోటి, బద్వేలు, పులివెందుల, ఎర్రగుంట్ల ప్రాంతాలకు సరఫరా జరుగుతోంది. గంజాయి విక్రయిస్తున్న ముఠాల్లో ముఖ్యంగా డిగ్రీ పీజీ బీటెక్ చదివే విద్యార్థులు ఉంటున్నారు. ఈ గంజాయి విక్రయాలు జిల్లాలోని అన్ని ముఖ్య పట్టణాలు మండల కేంద్రాలకు సైతం పాకుతున్నట్లు సమాచారం.

పట్టుబడుతున్న గంజాయి గ్యాంగులు

గంజాయి విక్రయిస్తున్న గ్యాంగులు జిల్లా వ్యాప్తంగా పట్టుపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా గంజాయి పట్టుబడటానికి కారణం కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసుల నిఘా పెరిగింది. ముఖ్యంగా జిల్లాకు కొత్తగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వచ్చాక అసాంఘిక నేరాలను అరికట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే ఈ నెల 17, 19 తేదీలలో వరుసగా కడపలో పలుస్టేషన్ల పరిధిలో గంజాయి విక్రయదారులను అరెస్టు చేసి వారినుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 21వ తేదీ ప్రొద్దుటూరులో టూటౌన్ పోలీసులు గంజాయి విక్రయించే నలుగురు యువకులను అరెస్టు చేశారు. వీరంతా 20 ఏళ్ల వయసున్న ఎర్రగుంట్ల ప్రాంతానికి చెందిన వారు కావడం విశేషం. వీరు వైజాగ్ నుంచి తెలిసిన వ్యక్తుల ద్వారా పూతరేకుల మాటున గంజాయిని ప్రైవేటు బస్సుల్లో తీసుకొచ్చేవారని పోలీసులు గుర్తించారు. ఇలా తెప్పించిన గంజాయిని వీరు ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో కాలేజీలను టార్గెట్ చేసుకుని విక్రయాలు సాగించారు.

కొనసాగుతున్న గాంజా ఆపరేషన్

జిల్లాలో గంజాయి మత్తుకు లోనవుతున్న వారిలో కాలేజీ యువతే కీలకంగా ఉండటంతో పోలీసులు గాంజా ఆపరేషన్‌ను జిల్లా అంతటా కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా ప్రొద్దుటూరులో సోమవారం నలుగురు విద్యార్థులను రూరల్ పోలీసుల సహకారంతో స్పెషల్‌పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో బీటెక్ చదివే గోపవరంకు చెందిన విద్యార్థి ఉన్నారు. అలాగే మత్స్య కాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి ఆటోనగర్‌లోని అతని షాపులో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరి విచారణలో అసలైన మరో వ్యక్తి హైదరాబాదులో ఉంటున్నాడని సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ విద్యార్థులు గంజాయి విక్రయాలు జరిపారని, వీటిని నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన యువకుడి నుంచి ప్రొద్దుటూరుకు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ప్రొద్దుటూరులోని నలుగురు విద్యార్థులను జమ్మలమడుగు పోలీసు స్టేషన్లో విచారిస్తున్నట్లు సమాచారం. వీరితో పాటు జమ్మలమడుగులో ఐదుగురు, ఉదయగిరికి చెందిన మరొకరు.. మొత్తం పదిమందిని విచారిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. నేడో రేపో పోలీసులు వీరి అరెస్టు చూపించే అవకాశం ఉంది.

వైసీపీ పాలనలో నిఘా నిద్రపోవడంతో..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిఘా వ్యవస్థ పూర్తిగా నిద్రావస్థలో ఉండటంతో జిల్లాలో గంజాయి మత్తు పాకిందని ఇప్పటివరకు చేసిన అరెస్టులతో స్పష్టమవుతోంది. పోలీసు వ్యవస్థ పూర్తిగా తమ విధులను పక్కన పెట్టి నాయకుల అనుచరులుగా వ్యవహరిస్తు పెద్దఎత్తున జేబులు నింపుకున్నారనే ఆరోపణలున్నాయి. అందువల్లే గతంలో జిల్లాలో జూదం పేకాట క్రికెట్ బెట్టింగ్ అక్రమ మద్యం గంజాయి విచ్చలవిడిగా సాగాయి. ఇప్పటికైనా పోలీసులు గంజాయిపై ఉక్కుపాదం మోపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్ గాంజా పూర్తిచేస్తాం..

జిల్లాలో గంజాయి పెద్దఎత్తున సరఫరా అవుతోంది. ఇందులో కాలేజీ విద్యార్థులే టార్గెట్ గా ఉన్నారు. అందువల్ల ఈ గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి ఆపరేషన్ గాంజా కొనసాగుతోంది. జిల్లాలో ఎక్కడా గంజాయి వాసన, మత్తు అనేది లేకుండా చేసేందుకు పోలీసు అధికారులంతా సమన్వయంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాం. ఇందులో బాగంగా ప్రైవేటు ట్రావెల్స్ యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. గంజాయి సరఫరా అయితే బస్సులు సీజ్ చేస్తామని హెచ్చరించాం.

- భక్తవత్సలం, డీఎస్పీ, ప్రొద్దుటూరు

టిడ్కో డిపాజిట్లు చెల్లించేదెప్పుడో..!

- ఆరేళ్లు దాటినా.. అతీ గతి లేని వైనం ● ఇల్లు లేదు... డబ్బులు లేవు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు ● ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..

బద్వేలుటౌన్, ఆగస్టు 27: టీడీపీ ప్రభుత్వం 2014-2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు సామాన్య, పేద ప్రజల సొంతింటి నెలవేర్చడం కోసం టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న టిడ్కో ఇళ్లను రద్దు చేసింది. దీంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం చెల్లించిన డిపాజిట్లు వెనక్కు ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఐదేళ్ల కాళ్లు అరిగేలా తిరిగినా.. వైసీపీ ప్రభుత్వం కానీ.. అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

టీడీపీ ప్రభుత్వం హయాంలో పట్టణ మౌలిక సదుపాయల కల్పన అభివృద్ధి (టిడ్కో) ఆద్వర్యంలో బద్వేలు పట్టణానికి సమీపంలోని తెలుగుగంగ కాలనీలో టిడ్కో గృహనిర్మాణాలు చేపట్టింది. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు రూ.25 వేలు, రూ.50వేలు, రూ.500 డిపాజిట్లను డీడీల రూపంలో చెల్లించారు. దీంతో 300, 365, 430, చదరపు అడుగుల విస్తీర్ణంలో 3 రకాల గృహ నిర్మాణాలను ప్రారంభించింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో నిర్మాణాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం టిడ్కో లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన నగదును చెల్లించలేదు. బాధితులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఎన్నిమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించు కోలేదు. లబ్ధిదారులకు డబ్బులు చెల్లించకపోవ డంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. మున్సిపాలిటీ బ్యాంక్ అకౌంట్‌లో టిడ్కో లబ్ధిదారులకు సంబంధించిన డబ్బు ఉన్నప్పటికీ వారికి నగదు చెల్లించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. మొత్తం లబ్ధిదారులకు రూ.29,41,500లు నగదు రావాల్సి ఉండగా.. ఇంత వరకు ఆ ఊసేలేదు. లబ్ధిదారులు ఇంటి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టక. డిపాజిట్ చేసిన సొమ్ములు చెల్లించక గత వైసీపీ ప్రభుత్వం తమ జీవితాల్లో చీకటి నింపిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోవడంతో డిపాజిట్ సొమ్ము చెల్లిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం...

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు డిపాజిట్లు చెల్లించిన మాట వాస్త వమే. డిపాజిట్ చేసిన లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

-వాకమల్ల వెంకట నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బద్వేలు


పునాది దశలోనే నిలిచిపోయిన టిడ్కో గృహనిర్మాణాలు

మహిళ ఫిర్యాదుతో ఇసుక రీచ్ నిలిపివేత


ఇసుక రీచ్ నిలిపివేయడంతో ఆగిపోయిన లారీలు

సిద్దవటం, ఆగస్టు 27: మండలంలోని జ్యోతి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ఓ మహిళ ఫిర్యాదుతో తాత్కాలికంగా నిలుపుదల చేశారు. జ్యోతి గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి వెంకటసుబ్బమ్మ అనే మహిళా రైతు 143/1 , 143/2 సర్వే నెంబర్లకు చెందిన భూమి తన పేరుమీద ఉందని, ఆ ప్రాంతంలో ఇసుక రవాణా జరుగుతుందని, వాటిని నిలుపుదల చేయాలని సోమవారం రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు మురాషావలి మంగళవారం ఇసుక డంపింగ్‌యార్డు వద్దకు చేరుకుని సమస్య పరిష్కారం కోసం ఆ ప్రాంతంలో సిబ్బందితో సర్వే నిర్వహించారు. నివేదికను పైఅధికారులకు అందజేసి రెండు రోజుల్లో యదావిధిగా రీచ్‌లకు అనుమతిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

వల్లూరు, ఆగస్టు 27: మండల పరిధిలోని పాపాఘ్ని నది నుంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి మంగళవారం ఎస్ఐ సంజీవరాయుడు చర్యలు చేపట్టారు. చెరువుకిందిపల్లె, దుగ్గాయపల్లె, కట్టసమీపాన దారిలో మూసి వేస్తూ ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయించారు. అక్రమంగా ఇసుక తోలితే చట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.


ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయిస్తున్న ఎస్ఐ

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

పెండ్లిమర్రి, ఆగస్టు 27: నంది మండలం వద్ద పాపాఘ్ని నది నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందిమండలం పాపాఘ్ని నది నుంచి సోమవారం రాత్రి కొంతమంది వ్యక్తులు ఎక్స్‌కవేటర్ ఉపయోగించి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి నాలుగు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్సకవేటర్‌ను సీజ్ చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కడప (క్రైం), ఆగస్టు 27 : కడప నగరం రిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న షేక్ మౌలాలి(22) అనే యువకుడు మృతి చెందాడు. రిమ్స్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు.. కడప అల్మాస్‌పేటకు చెందిన మౌలాలి స్నేహితులతో కలిసి ఈనెల 25న నగరవనం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరాడు. స్పోర్ట్స్ స్కూలు సమీపంలోకి రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు అదుపు తప్పి కింద పడిపోవడంతో మౌలాలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తేలు కాటుతో విద్యార్థి మృతి



రాజంపేటటౌన్, ఆగస్టు 27: రాజంపేట మండలం తొగురుపేట గ్రామంలో పత్తూరు హేమంత్(10) తేలు కాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. తొగురుపేట గ్రామానికి చెందిన నరసయ్య, రామసుబ్బమ్మల కుమారుడు హేమంత్ రాజంపేట పట్టణంలోని మన్నూరు ప్రియదర్శిని పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో తల్లిదండ్రులు తొగురుపేటకు తీసుకెళ్లారు. ఇంటిలో ఉండగా తేలు కుట్టింది. గమనించిన తల్లిదండ్రులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. హేమంత్ మృతితో తొగురుపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



కమలాపురం రూరల్, ఆగస్టు 27: నగర పంచాయతీలోని పెద్దదర్గా వద్ద గుర్తు తెలియని వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. వృద్ధురాలు ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. అయితే మృతురాలి ఆధార్‌కార్డులో కడప చిన్నచౌకు ముత్తురాసుపల్లికి చెందిన బీగాల సాయమ్మగా అడ్రస్ ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి తెలపాలన్నారు. ఆమె బంధువులు ఎవరైనా ఉంటే సెల్: 9121100532 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

పోరుమామిళ్ల, ఆగస్టు 27 : మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు బద్వేలు కోర్టు మూడురోజులు జైలు శిక్ష విధించిందని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వంకమర్రి గ్రామానికి చెందిన బాలసాని వెంకట నారాయణ, చెన్నరెడ్డిపేటకు చెందిన చీమలదిన్నె చంద్రయ్యలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. మంగళవారం బద్వేలు మెజిస్ట్రేట్ వారికి మూడురోజులు జైలుశిక్ష విధించిందని తెలిపారు.

కారు అదుపు తప్పి బోల్తా- నలుగురికి గాయాలు

సంబేపల్లె, ఆగస్టు 27: మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి దేవపట్ల సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం కారు అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రాజంపేటకు చెందిన గాంధీ, శివ, జన బద్వేలుకు చెందిన పోల్‌రెడ్డి కారులో పీలేరుకు వెళ్తుండగా దేవపట్ల సబ్‌స్టేషన్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడటంతో గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీశారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

సిద్దవటం, ఆగస్టు 27: మండలంలోని లింగంపల్లె గ్రామానికి చెందిన గాజుల గంగయ్య హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్, సిద్దవటం ఎస్ఐ చిరంజీవిలు తెలిపారు. వారి వివరాల మేరకు... లింగంపల్లె గ్రామానికి చెందిన గంగయ్య భార్య సంధ్య, పిల్లలు యశోధ(7), జయశ్రీ(3)తో కలిసి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గంగయ్య భార్య సంధ్య అదే గ్రామంలో వాటర్ వర్క్స్ విభాగంలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న పసుపులేటి బలరాముడుతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. ఓ రోజు గంగయ్య కడపలో పెళ్లి కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి బలరాముడుతో కలిసి ఉండడం గమనించి.. తీవ్రంగా మందలించాడు. దీంతో గంగయ్యను అడ్డుతొలగించుకునేందుకు సంధ్య, ప్రియుడు బలరాముడుతో కలసి మృతుడి తలపై కొట్టి చంపారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా గంగయ్య మృతదేహాన్ని ఆటోలో తీసుకుపోయి రాయచోటి గువ్వలచెరువు ఘాట్‌లో లోయలో పడేశారు. ఆ తర్వాత ఏమి ఎరగనట్లు ఇంటికి వచ్చి.. తన భర్త అదృశ్యమైనట్లు సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, తిరుపతిలో నివాసం ఉంటున్న గంగయ్య అన్న వెంకటయ్య అనుమానం వ్యక్తం చేస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు నిందితులను అరెస్టు చేసి నిజాలు వెలికితీసినట్లు సీఐ, ఎస్‌లు తెలిపారు. గంగయ్య మృతదేహాన్ని గువ్వలచెరువు ఘాట్‌లోయలో నుంచి బయటకు తీయించి.. పోస్టుమార్టం చేశామన్నారు. నిందితులు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

ఫ్రీహోల్డ్ భూముల విచారణ పక్కాగా చేపట్టాలి : కలెక్టర్


లక్కిరెడ్డిపల్లెలో ఫ్రీహోల్డ్ భూముల గురించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె / రామాపురం, ఆగస్టు 27: ఫ్రీహోల్డ్ భూముల విచారణ పక్కాగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలో ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ భూముల సర్వే నంబర్లు పరిశీలించి రీ వెరిఫికేషన్ చెయాలన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో 487.71 ఎకరాలలో ఫ్రీహోల్డ్ భూములున్నాయని .. వందశాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఫ్రీహోల్డ్ భూముల లబ్ధిదారులతో మాట్లాడి రీ వెరిఫికేషన్‌చేయాలన్నారు. రైతులు, ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను తక్షణం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. డీకేటీ భూముల వివరాలు సేకరించి అర్హులైన వారికి పట్టాలు అందించాలన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఆర్ఐ సమ్మత్‌ఖాన్, వీఆర్వో వెంకోజీరావు, మండల సర్వేయర్ కరీముల్లా, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రామాపురం మండలంలోని నీలకంఠ్రావుపేట, గువ్వలచెరువు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఫ్రీ హోల్డ్ భూములను కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 70 శాతం ఫ్రీ హోల్డ్ భూములను పరిశీంచామన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజేయులకు సూచించారు. అలాగే గోపగుడిపల్లె గ్రామంలో ఫ్రీ హోల్డ్ భూములను మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ పరిశీలించారు. అనంతరం ఆయన రామాపురంలో ఉన్న సరస్వతిపల్లె సహకార బ్యాంక్‌ను తనిఖీ చేశారు. రైతులకు సంబంధించిన రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4400 ఎకరాలు ఫ్రీ హోల్డ్ భూములను గతంలో గుర్తించారని.. వాటిని పరిశీలించి అక్రమాలు జరగకుండా రైతులకు న్యాయం చేయాలని వీఆర్‌వోలకు ఆదేశించారు. తహసీల్దార్ రామాంజనేయులు, మండల సర్వేయర్ నాగలక్ష్మి, వీఆర్‌వోలు ఫాతిమా, నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సత్తా చాటిన గురుకులం విద్యార్థులు


కుస్తీపోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 27: రాష్ట్రస్థాయిలో జరిగిన కుస్తీ పోటీల్లో మండలంలోని సంజీవపురం గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మన్సూర్ అలీ తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట బాలికల హైస్కూల్లో ఆగస్టు 25, 26న జరిగిన కుస్తీ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు 16 మంది పాల్గొన్నారు. వీరిలో ఒకరు బంగారు పతకం, 12 మంది కాంస్య పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు విజయనందమూర్తి, సురేంద్రలు తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రాంగణంలో బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం విద్యార్థులు...

కమలాపురం రూరల్, ఆగస్టు 27 : స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రీడా పోటీల్లో బంగారు పతకంతో పాటు సిల్వర్ మెడల్ కూడా సాధించారని ప్రిన్సిపల్ తులసమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీల్లో రేణిగుంట జరిగిన పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన జెచందన, ప్రియ గోల్డ్ మెడల్ సాధించగా మల్లిక, పూజిత, మల్లేశ్వరి సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పాటు పీఈటి చంద్రకళావతి, ఉపాధ్యాయులు పిల్లలకు అభినందనలు తెలిపారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మంగంపేట గనుల్లో కుంభకోణంపై విచారణ చేపట్టాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసిన ఏపీ సమగ్రాభివృద్ధి అధ్యయనవేదిక అధ్యక్షుడు లక్ష్మీనారాయణ


సీఎంకు పంపిన లేఖను చూపుతున్న లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు, ఆగస్టు 27: మంగంపేట ముగ్గురాయి గనుల్లో జరిగిన కుంభకోణాలపై సత్వరమే విచారణ పూర్తి చేసి.. అవినీతి తింగలాలను శిక్షించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఏపీ సమగ్రాభివృద్ధి అధ్యయనవేదిక అధ్యక్షుడు తుంగా లక్ష్మీనారాయణ లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈనెల 23న మంగంపేట గనులకు చెందిన కార్మికులు, లారీ యజమానుల ప్రతినిధులను కలసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశామని తెలిపారు. 1961లో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీయండీసీ) ఏర్పాటు చేశారన్నారు. 1974 నుంచి మంగంపేట గ్రే బైరైటీస్ ఖనిజాన్ని ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ముడి సరుకుగా గ్రే బైరైటీస్ రాయిని లేదా పౌడర్ చేసి 30 దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. ఇది పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్ పరిశ్రమల్లో వినియోగించే కీలకమైన ఖనిజంగా పేరు గాంచిందన్నారు. అంతర్జాతీయంగా 25శాతం అవసరాలను మంగంపేట గనులు తీరుస్తున్నాయన్నారు. బైరైటీస్‌లో ఏ, బీ, సీ గ్రేడ్లు గా వర్గీకరించి ఏడాదికి దాదాపు 3 మిలియన్ టన్ను ఖనిజాన్ని వెలికి తీస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు 2022-23లో రూ.1,000 కోట్ల ఆదాయం వచ్చి నట్లు అధికారికంగానే వెల్లడించారన్నారు. అయి తే మంగంపేట బైరైటీస్ గనుల వల్ల ఆ ప్రాంతానికి జరగాల్సిన రవాణా, విదేశాలకు ఎగుమతి ద్వారా ప్రైవేటు సబ్‌లీజులు, తవ్వకాలు, రవాణా, విదేశాలకు ఎగుమతి ద్వారా ప్రైవేటు యజమానులు రాష్ట్ర ప్రభుత్వ ఖజా నాకు సమకూరాల్సిన సంపదను కొల్లగొట్టారన్నారు. వైఎస్ రాజారెడ్డితో మొదలైన ఘరానా దోపిడి నేటి వరకు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉందన్నారు. ఏ-గ్రే డు ఖనిజాన్ని బీ-గ్రేడుగా నమోదు చేయడం, ఖనిజం రవాణా చేసే సందర్భంలో తూకం వేయడంలో, వాహనాల సంఖ్య నమోదులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. ఏపీయండీసీ సంస్థలో తాత్కాలిక ఉద్యోగులుగా వందల మందిని అక్రమ పద్ధతుల్లో నియమించి వారి ద్వారా అవినీతి పనులను సాగించారని తెలిపారు. మంగంపేట బైరైటీస్ గనుల్లో మాఫియా దోపిడీకి అంతం పలకాలని.. బైరైటీస్ ఖనిజ ధర పరిశ్రమలను నెలకొల్పి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రభుత్వం కాలంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడానికి కూటమి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు.

ప్రత్యర్థుల బారి నుంచి రక్షణ కల్పించండి

- ఎస్పీకి మొరపెట్టుకున్న రాచంవాండ్లపల్లె వాసులు

రాయచోటిటౌన్, ఆగస్టు 27: గ్రామంలో ప్రత్యర్థుల బారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలంటూ సుండుపల్లె మండలం రాచంవాండ్లపల్లెకు చెందిన వల్లెపు నారాయణ కుటుంబ సభ్యులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు మొరపెట్టుకున్నారు. ఈమేరకు మంగళవారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సుండుపల్లె గ్రామం రాచవాండ్లపల్లెకు సమీపంలో సర్వేనెంబరు 2388లో తమకు 1.31 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని వల్లెపు నారాయణ భార్య అంజనమ్మ పేరుతో డీకేటీ పట్టా కూడా రెవెన్యూ అధికారులు ఇచ్చి ఉన్నారని తెలిపారు.

అయితే తమ భూమి పక్కన ఉన్న వారు మా భూమిలో నుంచి దారి కావాలని ఘర్షణకు దిగుతూ, తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వల్లెపు నారాయణ కుటుంబ సభ్యులు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

'వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27 : అవినీతి, అక్రమాలకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకరర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసీపీకి విధేయుడిగా ఉంటూ యూనివర్సిటీ రిజిస్ట్రారు ప్రిన్సిపాల్‌గా ఉండి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, దీనిపై విచారణ జరిపించి ఆయన్ను బాధ్యతల నుంచి తొలగించాలన్నారు.

పాత పింఛన్ విధానం మాత్రమే అమలు చేయాలి: ఎస్టీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27: పాత పింఛన్ విధానం మాత్రమే అమలు చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు కోరారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపిన యూపీఎస్‌లో ఉద్యోగుల జీతాల నుంచి నెలవారీ కోత అయ్యేవిధంగా ఆమోదం తెలపాలన్నారు. జీతం నుంచి కంట్రిబ్యూషన్ లేకుండా వచ్చే పెన్షన్ మాత్రమే ఉద్యోగులు గత 25 సంవత్సరాల నుంచి కోరుతున్నారన్నారు. పాత పెన్షన్‌విధానం మాత్రమే ఇవ్వాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవీని విమర్శించే అర్హత మేయర్‌కు లేదు: టీడీపీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27 : కడప ఎమ్మెల్యే మాధవీని విమర్శించే అర్హత మేయరు సురేష్‌బాబుకు లేదని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు జిలానీబాషా పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు విశేష స్పందన వస్తుంటే వైసీపీ నాయకులు ఓర్వలేకున్నారన్నారు. కడపలో చెత్తసేకరణ జరగడంలేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యేకు చెడ్డపేరు తెచ్చేందుకు వైసీపీ మేయరు, కార్పొరేటర్లు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాజాపీర్, సాదక్, అక్రంఖాన్, బాషా, అస్లంబాషా పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే రెచ్చగొట్టే ధోరణి మానుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27 :ఎమ్మెల్యే మాధవి రెచ్చగొట్టే ధోరణిని మానుకోవాలని కార్పొరేటర్లు పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయరు చాంబరులో వారు విలేకరులతో మాట్లాడుతూ మేయరు ఇంటిపై ఎమ్మెల్యే కావాలని చెత్త వేసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కడపలో ఎక్కడా చెత్త సేకరణ ఆపలేదని, సేకరణ చేయవద్దని మేయరు చెప్పిన దాఖలాలు లేవన్నారు. అనవసరంగా కడపలో ఎమ్మెల్యే మాధవి గొడవలు సృష్టించడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న కడప నగరంలో ఎమ్మెల్యే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అసలు ఎక్కడైనా చెత్త సేకరణ చేయలేదని ప్రజలు ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించారు.

వైవీయూలో నేటి నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27 : వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ శాఖ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 5 వరకు ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ విభాగాధిపతి కోట మృత్యుంజయరావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ఎగ్జిబిషన్‌కు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

కడప నగరంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలి

- ఇరిగేషన్ మంత్రిని కోరిన ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27 : కడప నగరంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఇరిగేషన్ మంత్రి రామానాయుడిని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధులతో పెన్నానదిపై తలపెట్టిన చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆ సమయంలో పట్టించుకునే నాథుడులేడన్నారు. మన ప్రభుత్వంలో అయినా శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రికి విన్నవించారు.


మంత్రి రామానాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

గంజాయిపై దృష్టి సారించాలి

- హోంమంత్రికి ఎమ్మెల్యే వినతి

కడప నగరంలో గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించాలని కడప ఎమ్మెల్యే మాధవి హోంమంత్రి అనితను కోరారు. మంగళవారం అమరావతిలో హోంమంత్రిని కలిసి నగరంలో మాదక ద్రవ్యాలను అరికట్టి మహిళల రక్షణకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులతో బీటెక్ రవి భేటీ

పులివెందుల టౌన్, ఆగస్టు 27 : పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను మంగళవారం వెలగపూడి సచివాలయంలో కలిశారు. నియోజకవర్గంలో ఇరిగేషన్ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు.

మంత్రి ఆనంను కలిసిన బీటెక్ రవి

ఏపీ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన చాంబరులో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో దేవదాయ శాఖకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని బీటెక్ రవి పేర్కొన్నారు.


హోంమంత్రికి సమస్యలు తెలియజేస్తున్న బీటెక్ రవి

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత: పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 27 : ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో గ్రీన్‌కో సమస్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య, కంటి వైద్యశిబిరంలో పుత్తా నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, ప్ర జల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు కూడా ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్న డాక్టర్లను అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రీన్‌కో ఫౌండేషన్ మేనేజరు విశ్వనాథయ్య, ఏజీఎం రామేశ్వర్‌రావు, ఎం.వేణు, అకౌంటెంట్లు వెంకట్, అబ్దుల్, టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, శంకర్, సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.


కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పుత్తా

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు

కడప (కల్చరల్), ఆగస్టు 27: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించడం శుభప్రదమని భక్తుల విశ్వాసం. దీంతో ఇతర జిల్లాల నుంచి కూడా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. భక్తులకు ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు అమ్మవారికి పూజలు చేసి రాహుకాల దీపాలను వెలగించారు.


రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు(ఇన్‌సెట్) కొలువుదీరిన విజయదుర్గాదేవి

చీనీ వ్యాపారుల సిండికేట్‌ను అరికట్టండి: సీపీఐ

పులివెందుల టౌన్, ఆగస్టు 27 : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో మార్కెట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చీనీ కాయలమండీని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడి రైతులతో మార్కెట్ నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వేలం పాట నిర్వహిస్తున్న వ్యాపారస్తులు బయట నుంచి వేలం పాట ఎవరిని వెయ్యకుండా అడ్డుకుంటున్నారని వ్యాపారస్తులంతా సిండికేట్‌గా మారి రైతులకు నష్టం చేకూరుస్తున్నారని మార్కెట్ మొదలైనప్పుడు సూటు లేదు గేటు లేదని ప్రచారం చేసి ఇప్పుడు లక్షకు 8వేలు కమిషన్‌ను రైతుల నుంచి వసూలు చేస్తున్నారని లక్షకు 700 రూపాయలు మార్కెట్ కమిటి వసూలు చేస్తోందని, దీని ద్వారా రైతులను దోచుకుంటున్నారన్నారు. అదే విధంగా సుదూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే రైతులకు మార్కెట్లో కనీస సౌకర్యాలు కల్పించలేదని, రైతులకు విశ్రాంతి గదులు, భోజనం క్యాంటిన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే వే బ్రిడ్జిని సరిగా నిర్వహించడం లేదని తద్వారా రైతులు మార్కెట్‌కు దూరంగా ఉన్న వేబ్రిడ్జిల కోసం వెళ్లాల్సి వస్తుందని అన్నారు. తక్షణం మార్కెట్ కమిటి అధికారులు, జిల్లా కలెక్టరు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు గంగాసురేశ్, జిల్లా సమితి సభ్యులు శివశంకర్, అకీరా పాల్గొన్నారు.


చీనీకాయల మండీని పరిశీలిస్తున్న సీపీఐ బృందం

'ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలి'

కడప (నాగరాజుపేట), ఆగస్టు 27 : కడప నగరం చిన్నచౌకులో వంక పోరంబోకు స్థలాన్ని ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని అఖిలపక్ష నాయకులు అఖిలపక్ష నాయకులు నారాయణరెడ్డి, కిశోర్‌కుమార్, సత్తార్, సీఆర్వీ ప్రసాద్, అంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నచౌకులోని సర్వే నెం.247 లోని స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తాము కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారుకు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారన్నారు. ఈ సర్వేలో వంక పోరంబోకు 30 అడుగుల మేర ఆక్రమించినట్లు తేలిందన్నారు.

పంటనమోదు సక్రమంగా చేయాలి

వేంపల్లె, ఆగస్టు 27: పంట నమోదును సక్రమంగా చేయాలని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలను మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం అన్ని రైతు సేవాకేంద్రాలలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పంట నమోదుతో పాటు ఇ-కేవైసీ కూడా సెప్టెంబరు 15నాటికి చివరి తేది అని తెలిపారు. ప్రతి రైతూ నమోదు విధిగా చేసుకోవాలన్నారు.

30న వైవీయూలో వన మహోత్సవం

కడప(కలెక్టరేట్), ఆగస్టు 27: వైవీయూలో ఈనెల 30న వనమహోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జేసీ అదితి సింగ్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, జిల్లా అధికారులతో కలిసి వన మహోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరు

కడప (మారుతీనగర్), ఆగస్టు 27: ఆర్టీసీ కడప రీజియన్ వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప రీజనల్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఎన్ఎంయూ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆర్టీసీ కడప డిపో ఎన్ఎంయూ నాయకులు శ్రీనివాసులు, పిఎస్ ఖాన్, టి.ఎం. బాష, భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, హసీనాభాను, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా: ఇద్దరికి తీవ్రగాయాలు

ముద్దనూరు, ఆగస్టు 27: కడప - తాడిపత్రి హైవేరోడ్డులోని చింతకుంట గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి బైకును తప్పించబోయి అదుపు తప్పి కారు గుంతలో పడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... కడప నగరం నాగరాజుపేట, రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన వెంకటేష్, అతని భార్య హైమావతి, తమ్ముడు మల్లికార్జున, డ్రైవర్ నాయక్ కారులో వెంకటేష్ తల్లి కర్నూలు జిల్లా పత్తికొండలో ఉండగా చూసేందుకు వెళ్లి కడపకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మల్లికార్జున, హైమావతికి తీవ్రగాయాలు కాగా ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

అర్హులైన వారికే డీకేటీ పట్టాలు ఇవ్వాలి

వేంపల్లె, ఆగస్టు 27: అర్హులకు డీకేటీ పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి టీడీపీకి చెం దిన మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, రైతు విభాగ రాష్ట్ర నాయకులు జగన్నాథరెడ్డి మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సార్వత్రిక ఎన్నికలకు ఆరునెలల ముందు 700 ఎకరాల డీకేటీ పట్టాల పంపిణీ జరిగిందన్నారు. అర్హులకు మొండి చేయి చూపి, అనర్హులకు ఇచ్చారని తెలిపారు. కావున ఇప్పటికైనా అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. నాయకులు పూల బక్షు, మండల ప్రధానకార్యదర్శి మహబూబ్ షరీఫ్, డాక్టర్ కరిముల్లా, గంగాధర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

సన్నపురెడ్డికి కేతు పురస్కారం

కడప (కల్చరల్), ఆగస్టు 27: ప్రముఖ కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి, 2024 కేతు విశ్వనాథరెడ్డి జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వనున్నట్లు కవిత విద్యా సాంస్కృతిక సేవా అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్యచౌదరి మంగళవానం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ రచయితల పేర్లను కమిటీ పరిశీలించి ఏకగ్రీవంగా సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి పేరును ఎంపిక చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఈ ఏడాది నవంబర్‌లో ఆ పురస్కార ప్రధాన సభ కడప నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేత్రదానంపై విద్యార్థినులకు అవగాహన

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 27 : నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా అంధత్వ నివారణ సంఘం, కడప డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సునీత నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఒక వ్యక్తి నేత్రదానం చేస్తే ఇద్దరికి కంటి చూపు ప్రసాదించవచ్చన్నారు. మన రాష్ట్రంలో ఐ డొనేషన్ గురించి పెద్దగా అవగాహన లేదన్నారు. జన్యులోపాల వల్ల కలిగే అంధత్వం గురించి తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. పుష్పగిరి కంటి వైద్యశాల మేనేజరు సూర్యప్రకాశ్ ఐ బ్యాంకు ప్రత్యేకత గురించి వివరించారు. మన జిల్లాలో కార్నియా కలెక్షన్ ఎక్కువగా ఇవ్వనందు వల్ల ఐ బ్యాంకు నిర్వహణ చేయలేకపోతున్నామన్నారు. కావున ప్రజలు నేత్రదాన ఆవశ్యకతను గుర్తించి నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కంటి వైద్యనిపుణుడు డి.రవికుమార్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న సహాయ చర్యల గురించి వివరించారు. హిందీ విభాగాధిపతి ఎంఆర్ జయంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటివైద్యులు సుధాకర్‌రెడ్డి, గంగయ్య, విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


నేత్రదానం ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్ సునీత

ఎస్ఐ రంగస్వామికి సీఐగా పదోన్నతి

కడప (క్రైం), ఆగస్టు 27 : కడప వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న రంగస్వామికి సీఐగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని పలు స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం అయిన వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తూ సీఐగా పదోన్నతి పొందారు. రాయలసీమ జోన్‌లో ఏడు మంది ఎస్ఐలకు సీఐగా పదోన్నతి లభించింది.



1న విజయవాడలో రాష్ట్ర కమిటీ సమావేశం

కడప (నాగరాజుపేట), ఆగస్టు 27: సెప్టెంబరు 1న విజయవాడలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డీఎస్ జయరాం పేర్కొన్నారు. మంగళవారం ఆ పార్టీ కడప జిల్లా కమిటీ సమావేశం స్థానిక బీఎస్పీ జిల్లా కార్యాయలంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ కడప జిల్లా ఇన్‌చార్జ్ సగిలి గురప్ప హాజరై మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి ఆదేశాల మేరకు వచ్చే నెల 1న రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలో ఉంటుందన్నారు. సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. సెప్టెంబరులో కడప జిల్లాలో బీసీల కులగణన నిర్వహించాలని బీఎస్పీ ఆదేశాలతో కడప జిల్లాలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర నాయకత్వం హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, ప్రొద్దుటూరు అసెంబ్లీ నాయకులు సుబ్బరాయుడు మహిళా అధ్యక్షురాలు బేబి, కమలాపురం అసెంబ్లీ నాయకుడు రెడ్డయ్య పాల్గొన్నారు.

'విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి'

కడప (నాగరాజుపేట), ఆగస్టు 27 :వామపక్షాల ఆధ్వర్యంలో నేడు కడప నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న నాటి పాలకులు ప్రపంచ బ్యాం కు షరతులో భాగంగా విద్యుత్ చార్జీల పెంపునకు పూనుకున్నారన్నారు. దీనికి ఏపీ ప్రజానీకం, వామపక్షాలు, కాంగ్రెస్ శ్రేణులు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించాయన్నారు. నిర సనకారులపై వారిపై లాఠీలు, తూటాలు ప్రయోగించారన్నారు. ఈ దాడుల్లో సీఐటీయూ, సీపీఎం రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రాణాలు అర్పించారన్నారు. వారికి స్ఫూర్తిగా నేడు జరిగే సంస్మరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

స్థానిక సమస్యలపై చొరవ చూపాలి : సీపీఐ

కమలాపురం రూరల్, ఆగస్టు 27 : కమలాపురం నగర పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు కోరారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కమిషనరు రాముడికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ కమలాపురం ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కమలాపురం నగర పంచాయతీ అయినప్పటి నుంచి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల మురికినీటి సమస్య ఏర్పడిందన్నారు. కాల్వలు ఎత్తులో రోడ్లు తగ్గులో ఉండడం వల్ల వర్షం పడినప్పుడు చెరువులను తలపించేలా రోడ్లు తయారయ్యాయన్నారు. పందులు, దోమలు, విషపురుగుల సంచారం ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదన్నారు. తక్షణం ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

'ప్రభుత్వ సొమ్మును కాజేసిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27: ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ సొమ్మును కాజేసిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు.మంగళవారం డీవీఈఓ వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ప్రభుత్వం నాడు-నేడు పనుల కోసం రూ.కోటీ 15 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే కళాశాల ప్రిన్సిపాల్ ఇంత వరకు రూ.53 లక్షలు వచ్చిందని, మిగతా మొత్తం రావాలని తెలిపారన్నారు. అయితే అక్కడికి వెళ్లి చూడగా పాత భవనాలకు రంగులు పూసి ఎటువంటి మరమ్మతులు చేయకుండా అక్రమంగా బిల్లులు పెట్టుకుని నిధులు దోచుకున్నట్లు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కౌశిక్, ఇందిరేశ్ పాల్గొన్నారు.


డీవీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

'అక్రమ అడ్మిషన్లు చేస్తున్న డిగ్రీ కళాశాలల గుర్తింపు రద్దుచేయాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27:జిల్లాలోని కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం అక్ర మ అడ్మిషన్లు చేసుకుంటూ విద్యార్థులను మోసం చేస్తున్నారని, ఆ కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం వైవీయూలో వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెట్టింపుస్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నార న్నారు. విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌యూ ప్రతినిధులు

యూనివర్సిటీ అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 27 : వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలని వైవీయూ అధ్యాపకులు డి మాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పీజీ సెట్, నెట్ పీ హెచ్‌డీ అర్హత కలిగి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న తమకు ఎంటీఎస్ అమలు చేసేలా చూడాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ ఎంటీఎస్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుందని, అయితే సమయం చెప్పలేం అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్ ప్రతినిధులు అనిల్‌కుమార్, డాక్టర్ తుమ్మలూరు సురేశ్‌బాబు, డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ ఖాజపీర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించాలి

వేంపల్లె, ఆగస్టు 27: క్షేత్రస్థాయిలో పర్యటించి మలేరియాపై అవగాహనకల్పించాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వాతిసాయి ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సిద్దయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్నవారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడుసార్లు ల్యాబ్‌కు అందించాలన్నారు. మలేరియా వచ్చిన గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే , పైఫోన్త్రిన్ పిచికారీ చేయాలన్నారు.

అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి

జమ్మలమడుగు, ఆగస్టు 27: ఆర్టీసీ కార్మికుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ వారు డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగులో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డిపోలలో అలవెన్స్‌లు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నూతన కండక్టర్, డ్రైవర్ల ఫిక్స్‌డ్ చార్టులు వేయాలన్నారు. రికవరీలు పెట్టి ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులను వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

17 టీయంసీలు దాటిన గండికోట నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 27: గండికోట ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రానికి 17.2 టీఎంసీల నీటిమట్టం దాటినట్లు అధికారులు తెలిపారు.జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 12,500 క్యూసెక్కులు ఉంది. కాగా గండికోట ప్రాజెక్టు నుంచి వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా 1000 క్యూసెక్కుల నీటిని గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్‌కు వదులుతున్నారు.

మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలి

బద్వేలు, ఆగస్టు 27 :మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో గల సర్వే నెంబరు 1008లో నివాసం ఉంటున్న కుటుంబాల వారికి మంచినీటి కుళాయి కనెక్షన్ అందజేయాలని కోరుతూ మంగళవారం సీపీఎం బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ నాయకుడు చిన్ని మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో దాదాపు 100 కుటుంబాలు ఉన్నాయని వారికి మంచినీటి కనెక్షన్ అందించడంలో గత మున్సిపల్ కమిషనర్ విఫలమ య్యారన్నారు. దీంతో ఇక్కడి ప్రజలు పొలాలలోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారన్నారు. సీపీఎం నాయకులు ఆదిల్, మోక్షమ్మ, అనంతమ్మ, ఖైరున్‌బీ, మస్తాన్ బీ, బాలమ్మ, రామలక్షుమ్మ, ఫాతిమా, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ కావాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 27 : ప్రభుత్వ ఉద్యోగులకుసీపీఎస్, యూపీఎస్ వద్దు, ఓపీఎస్ కావాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి అన్నారు. మంగళవారం పోరుమామిళ్ల రీజియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్, యూపీఎస్ వద్దు, ఓపీఎస్ కావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బయ్య, అన్వర్‌బాషా, తిరుమలరెడ్డి, సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.





భవిత కేంద్రంలో రికార్డులు తనిఖీ


జమ్మలమడుగు, ఆగస్టు 27: జమ్మలమడుగులోని ఎంపీడీవో కార్యాలయ మైదానంలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆ శాఖకు సంబంధించిన జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ కేశవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం జమ్మలమడుగులో భవిత కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తగు సూచనలు అందించి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అర్చన పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడుకోవాలి

మైదుకూరు రూరల్ ,ఆగస్టు 27 : రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడుకోవాలని ఏవో లక్ష్మీప్రసన్న తెలిపారు. కడప రోడ్డులోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామీణవిత్తనోత్పత్తి పథకం కింద విత్తనాలు ఇచ్చిన రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నారుమడులను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు అందచేశారు. వరినాట్లు వేసే మునుపు నారు కొనలను తుంచి వేయడం వలన కాండం తొలుచు పురుగు బారిన పడకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఓ నాగభూషణం, బేబి, దేవిప్రియా, రైతులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

ఇద్దరికి తీవ్రగాయాలు


మల్లికార్జున

ముద్దనూరు ఆగస్టు27:మండల పరిధి కడప తాడిపత్రి హైవేలోని చింతకుంట గ్రామసమీపంలో మంగళవారం రాత్రి బైకును తప్పించబోయి అదుపు తప్పి కారు గుంతలో పడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కడప నగరం నాగరాజుపేట, రాజీవ్‌నగర్‌కు చెందిన వెంకటేష్, అతని భార్య హైమావతి, తమ్ముడు మల్లికార్జున, డ్రైవర్ నాయక్ కారులో వెంకటేష్ తల్లి కర్నూలు జిల్లా పత్తికొండలో ఉండగా చూసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కడపకు వస్తుండగా ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి రోడ్డు పనుల నిమిత్తం చేస్తున్న గుంతలో పడింది. దీంతో మల్లికార్జున, హైమావతికి తీవ్రగాయాలయ్యాయి.వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల్యవివాహాలు నేరం

చాపాడు, ఆగస్టు 27: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు సీడీపీవో సావిత్రమ్మ అన్నారు. చాపాడులోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం బాల్య వివాహాలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రమ్మ మాట్లాడుతూ బాలికలు బాల్యవివాహాలు చేసుకోవద్దన్నారు. ఈ వయస్సులో బాలికలు బాగా చదువుకుని మంచి ఉన్నతస్థానాల్లో నిలువాలన్నారు. అనంతరం బాలికలు బాల్యవివాహాలతో జరిగే నష్టాలను గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, పీఈటీ హసీనా, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.



హడలెత్తిస్తున్న ఆటో ప్రయాణం

నిబంధనలు పాటించని డ్రైవర్లు ● ఆటోల్లో పరిమితికి మించి ఎక్కిస్తున్న వైనం ● విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం




ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రయాణికులు, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులు

బద్వేలుటౌన్, ఆగస్టు 27 : బద్వేలు పట్టణంలో ఉన్న ఆటోడ్రైవర్ల ప్రవర్తన రోజు రోజుకూ శృతిమించిపోతుంది. ఆటోల్లో పెద్ద పెద్ద సౌండ్‌బాక్స్‌లు పెట్టడం, ద్వంద్వ అర్థాలు ఇచ్చే పాటలు పెట్టడం.. పెడ అర్థాలు వచ్చేలా ఆటోల వెనుక స్లోగన్స్ తదితర వాటితో ఆటోల్లో వెళ్లాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. అంతేగాకుండా ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ బస్సులకు ముందు, వెనుక ఆటోలు నిలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొంత మంది ఆటోడ్రైవర్లు మద్యం తాగి గుట్కాలు వేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అభం, శుభం తెలియని చిన్నారుల ప్రాణాలతో కొందరు ఆటోడ్రైవర్లు ఆటలాడు తున్నారు. ఒక్కో ఆటోలో పరిమితికి మించి విద్యార్థులకు ఎక్కించుకోకూడదన్న నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కేస్తూ పరిమితికి మించి విద్యార్థులను కుక్కేసి పాఠశాలలకు తీసుకువెళుతున్నారు. ఎంత ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే అంత ఎక్కువ మొత్తం డబ్బు వస్తుందన్న ఆశతో కొందరు డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను ఆటోలో ఎక్కిస్తున్నారు. దీని వల్ల ఆటో అద్దె తగ్గుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మిన్నకుండి పోతున్నారు. అయితే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. చాలా ఆటోలకు ఫిట్‌నెస్ లేకపోయినా రోడ్డుమీద తిప్పుతున్నారు. కొంత మంది డ్రైవర్లు మద్యం మత్తులో ఆటోలు నడుపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ద్విచక్రవాహనాల్లో భార్యాభర్తలు వెలుతున్న సమయంలో వారి వెనుక ఆటోల్లో వేగంగా వస్తూ పెద్దగా హారన్లు కొడుతూ విసిగిస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఏమి ఆటో తగిలిందా అంటూ బెదిరిస్తున్నారన్నారు. ఇలాంటి వన్నీ అధికారుల దృష్టికి వెళ్లినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

రూల్స్ అధిగమిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి, రూల్స్ అధిగమిస్తే చర్యలు తప్పవు. పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో ఎక్కిస్తున్న వాటిపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. ఆటోడ్రైవర్లు రూల్స్ అధిగమించినా, మద్యం తాగి ఆటోలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటాం.

రాజగోపాల్‌యాదవ్, బద్వేలు అర్బన్, సీఐ.

నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా చర్యలు

తహసీల్దారు ఉదయభారతి

గోపవరం, ఆగస్టు 27 : నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా చర్యలు కచ్చితంగా తీసుకుంటామని తహసీల్దారు ఉదయభారతి హెచ్చరించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల లంలోని మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామ పొలం సర్వేనెం.977/3, విస్తీర్ణత 2.03 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో చాటకొండు సుబ్బారావు తండ్రి సంజయ అనే వారి పేర్లు దరఖాస్తు పట్టా మంజూరైందన్నారు. ఆభూమిని నిర్ణీత కాల వ్యవధిలో సాగు చేయనందున నియమనిబంధనల మేరకు రద్దు పరిచారని తెలిపారు. ప్రస్తుతం సదరు ఈ సర్వే నెంబరుపై హైకోర్టులో వాజ్యం జరుగుతోందన్నారు. ఆ సర్వేనెంబరులో కొనుగోలు, అమ్మకాలు జరగటం చట్టరీత్యా నేరమన్నారు. ఎటువంటి కట్టడాలు చేయకూడదని నిర్మాణంలో ఉన్నా ఖాళీ చేయాల్సిందేనని, స్థలంలో ఇతరులు ప్రవేశించరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

బద్వేలు రూరల్, ఆగస్టు 27 : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బద్వేలు ఖజానా శాఖ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో ఉన్న పెన్షనర్ల కార్యాలయంలో నూతన భవన నిర్మాణానికి విరాళాలందించిన పెన్షనర్ల సన్మాన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు ఎవరైనా కార్యాలయానికి వచ్చి సమస్యలు చెబితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి గానుగపెంట హనుమంతరావు, బహ్మాయ్య, గంగన్న, పుల్లంరాజు, పుల్లయ్య, పిచ్చయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



పుష్పాలంకరణలో వేణుగోపాలస్వామి, అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 27: శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున వేణుగోపాలస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, పూలమాలలు, వెండికవచాలతో ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం వేద పండితులు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను యాదవ సేవా సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చల్లా రాజగోపాల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

గోపవరం, ఆగస్టు 27 : మండలంలోని చెన్నవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ పూజారి పెంచలయ్య తెలిపారు. దాతల సహాయ సహకారాలతో నూతనంగా ఆలయం నిర్మించామన్నారు. బుధవారం 9గంటలకు విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల భక్తులు హాజరు కావాలన్నారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నర్సాపురం పోస్టాఫీసులో అధికారుల విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

కాశినాయన ఆగస్టు27: నర్సాపురం పోస్టాఫీసు రెండు మూడు రోజులుగా మూతబడింది. ఇక్కడ పనిచేస్తున్న బీపీఎం నాయక్ విధులకు గైర్హాజరవుతున్నట్లు పైఅధికారుల దృష్టికి వెళ్ళడంతో మంగళవారం బద్వేల్ పోస్టల్ సబ్‌డివిజన్ హెడ్ ఎన్.సుబ్బరాయుడు పోస్టఆఫీసును తనిఖీ చేశారు. సిబ్బంది కార్యాలయం తెరవక పోవడంతో గ్రామస్థుల సమక్షంలో కార్యాలయం తాళాలు పగులగొట్టారు. అనంతరం లోపలి బీరువాబీగాలు పగలగొట్టి రికార్డులు బయటికి తీశారు. అధికారులు పొదుపు ఖాతాదారుల ఆన్‌లైన్ వివరాలు తెప్పించుకొని విచారణ ప్రారంభించారు. పలువురు ఖాతాదారులు జమచేసిన డబ్బులు, మ్యాన్‌వల్ పుస్తకాలకు, ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల దృషికి తీసుకపోయి ప్రత్యేక బృందంతో పూర్తిస్తాయి విచారణచేసి ఖాతాదారులకు న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.

తగ్గిన వరిసాగు

● వర్షాలు అంతంత మాత్రమే ● బోర్లకు నీళ్లు సరిపోక రైతుల ఇబ్బందులు


ధర్మాపురం గ్రామం వద్ద పొలంలో సత్తువలు చల్లుతున్న రైతులు

జమ్మలమడుగు, ఆగస్టు 27: జమ్మలమడుగు మండలంలో గత ఏడాది కంటే ఈసారి వరిసాగు తగ్గింది. మండలంలోని ధర్మాపురం, గొరిగెనూరు, దానవులపాడు, చలివెందుల, పెద్దదండ్లూరు, పి.సుగుమంచిపల్లె, సిరిగేపల్లె, కన్నెతీర్థం, సున్నపురాళ్లపల్లె, అంబవరం, గూడెం చెరువు, పొన్నతోట, చిటిమిటిచింతల తదితర గ్రామాల్లో వరిసాగు అధికంగా సాగు చేస్తారు. ఈసారి అరకొరగా వర్షాలు కురవడం, రైతులు వర్షం కోసం ఎదురు చూసి ఇటీవల కురిసిన వర్షానికి రైతులు వరి సాగుపై దృష్టి సారించారు. బోర్లు ఉన్న వారు గత నెలలో సాగు చేశారు. ఏది ఏమైనా బోర్లకు సక్రమంగా నీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. మిగతా గ్రామాల్లో రైతులు సేద్యాలు చేసుకుని ఇంకా పంట సాగుపై దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం జమ్మలమడుగు మండలంలో గత ఏడాది రెండు వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈసారి ఆగస్టు నెల చివరి వరకు దాదాపు వెయ్యి ఎకరాలు సాగు చేశారు.

'ఎమ్మెల్యే వరదపై విమర్శలు తగదు'


మాట్లాడుతున్న సుంకర వేణుగోపాల్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 27: ప్రజల మద్దతుతో ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వరదరాజులరెడ్డిని అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వైసీపీ నాయకుడు బంగారురెడ్డి విమర్శించడం తగదని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ బీసీసెల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచకలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమాలు జరిగాయన్నారు. గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్, ల్యాండ్ మాఫియా వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే నడిచిందని, నందం సుబ్బయ్యను దారుణంగా హత్య చేశారని విమర్శించారు. ట్రాక్టర్లతో ఇసుక అమ్ముకున్నామని బంగారురెడ్డి బహిరంగంగా ఒప్పుకున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. వైసీపీ నాయకులు పట్టణాభివృద్ధికి ఏరోజూ కృషి చేయలేదని విమర్శించారు. వైసీపీలోని ఒకరిద్దరు నాయకుల నియంతృత్వాన్ని భరించలేక ఆ పార్టీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని దీన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, బాలయ్య, టీడీపీ జిల్లా కార్యదర్శి శ్రీరామ బాలరాజు, బీసీసెల్ జిల్లా కార్యదర్శి మహేష్‌కుమార్, చిన్నరాయుడు, సన, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మార్కింగ్



ముద్దనూరు, ఆగస్టు27: రోడ్డు విస్తరణపై మండల సర్వే అధికారులు మార్కింగ్ వేయడంతో ప్రజలకున్న అనుమానాలు తొలగిపోయాయి. మంగళవారం మండల సర్వే అధికారులు, కాంట్రాక్టర్లు రోడ్డు సర్వే చేశారు. అలాగే హద్దులు ఏర్పాటు చేసి మార్కింగ్ వేశారు.డ్రైనేజీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, సెప్టంబరు నుంచి పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల, ఆగస్టు 27 : మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులు, బాలుర తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. మంగళవారం పోరుమామిళ్లలో వాహనాలు నడుపుతున్న బాలుర నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి వాహనాలు ఇచ్చిన వారిని బాలుర తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. మైనర్లు చాలా మంది ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ అతివేగంగా వాహనాలు నడుపుతున్నారన్నారు. అలా చేస్తే వాహనాలు సీజ్ చేయడమే కాక వాహనాల యజమానులు, మైనర్ల తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా మంగళగౌరీ వ్రతం



మైదుకూరు, ఆగస్టు 27 : స్థానిక కొత్తసాయిబాబా ఆలయంలో మంగళవారం మంగళగౌరి వ్రతాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు మంగళగౌరి వ్రతం ఆలయంలోనే నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కమనీయం వేణుగోపాలుడి కల్యాణం

రాజుపాలెం, ఆగస్టు 27 : క్రిష్ణాష్టమి పురస్కరించుకుని మంగళవారం అర్కటవేముల గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవవిగ్రహాలకు మంత్రోచ్చారణల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ ప్రాకారోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వరుణ దేవా కరుణించవా..?

● తడులకోసం రైతులకు తప్పని తిప్పలు

రాజుపాలెం, ఆగస్టు 27 : ఖరీఫ్‌లో ప్రధాన పంటలైన పత్తి, కంది, తదితర పంటలకు సాగు చేసిన రైతులకు వర్షం నిరాశే నింపింది. గత 20 రోజులుగా వర్షం పడకపోవడంతో పాటు తీవ్ర ఎండలు పెడుతుండడంతో మొలక దశలోనే పంట వాడిపోతుంది. చాపాడు కెనాల్‌కు నీరు రావడంతో కొంత మంది రైతన్నలు పంటలకు తడులు అందిస్తున్నారు. పంటలు ఏదోక విధంగా రక్షించుకునేందుకు తడులు తప్పడంలేదని రైతులు పేర్కొన్నారు. గత రెండురోజుల నుంచి మేఘాలు కమ్ముకున్నా వర్షం పడడంలేదు. అయితే ఇక వర్షం రాదన్న రైతన్నలు తడు లు అందిస్తున్నారు. ఇప్పటి నుంచే తడులు అందించడం ద్వారా ఖర్చులు మోపెడవు తాయన్నారు. తడి వేసినందుకు రోజుకు 2500 రూపాయలు ఖర్చు వస్తుందని రైతులు పేర్కొన్నారు. రోజంతా తడి వేసినా ఒక ఎకరా మాత్రమే పారుతుందన్నారు.


పత్తిపంటకు తడులు అందిస్తున్నరైతులు